కొనలేం..తినలేం



ధరల పట్టిక


ఏసీ కూరగాయల మార్కెట్

తారాస్థాయికి చేరిన కూరగాయల ధరలు

- దిగుబడులకు ఎండదెబ్బ
- గుడ్లు తేలేస్తున్న వినియోగదారులు

నెల్లూరు(బారకాసు): కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడం.. దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లలో ధరల్లో బాగా వ్యత్యాసం కనిపిస్తోంది. గతంలో రూ.100తో సంచి నిండా కూరగాయలు రాగా.. ఇప్పుడు వాటికి రూ.500 వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రజలు తమ ఆహారంలో నిత్యం వాడే అల్లం, పచ్చి మిర్చి ధరలు సెంచరీ దాటగా.. టమాటో ధరలూ అలానే ఉన్నాయి. మిగిలిన కూరగాయల ధరలు కిలోకు రూ.60 నుంచి రూ.200 వరకు పలుకుతున్నాయి.

రైతులకు మేలేదీ..?

పెరిగిన ధరలు రైతులకు మేలు చేయకపోగా.. దళారులు, రిటైల్ వ్యాపారులకు లాభాల వర్షం కురిపిస్తోంది. ఉద్యాన రైతులు రేయింబవళ్లు శ్రమించి.. ప్రకృతి వైపరీత్యాలను సైతం తట్టుకొని పంటలను పండిస్తున్నారు. వీరు మార్కెట్లో విక్రయించిన ధర.. వినియోగదారుడి చేతికొచ్చేసరికి మూడు రెట్లవుతోంది.

తగ్గిన దిగుబడులు

జిల్లాలోని పలు మండలాల్లో కూరగాయల పంటలను రైతులు ఎక్కువగా పండిస్తారు. ఈ ఏడాది వర్షాభావం.. తీవ్రంగా కాసిన ఎండల ప్రభావంతో కూరగాయల దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఈ క్రమంలో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడం సైతం ధరల పెరుగుదలకు ఓ కారణమైంది. ఈ నెల్లో ధరలు కాస్త అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని, అప్పటి వరకు ఇదే పరిస్థితులు కొనసాగుతాయని మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి.

ఉల్లిపాయల కృత్రిమ కొరత

ఉల్లిపాయలు కొనాలంటేనే వినియోగదారులకు కన్నీరొస్తోంది. గతంలో కురిసిన ఆకాల వర్షాలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈ పంట తీవ్రంగా దెబ్బతినింది. దీనికి తోడు మహారాష్ట్రలోని నాసిక్, సోలాపూర్, నాందేడ్, నాగపూర్ నుంచి దిగుమతులు తగ్గిపోయాయి. ఫలితంగా ఉల్లి ధర పెరుగుతూ వస్తోంది. మరోవైపు హోల్‌సేల్ వ్యాపారులు వీటిని నిల్వ చేసుకొని కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి.

భారీగా పెరిగిన టమాటో ధరలు

టమాటోను కొనుగోలు చేయాలంటే మధ్య తరగతి ప్రజలు జంకాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నిన్నామొన్నటి వరకు రూ.20 వరకు ఉన్న కిలో నేడు రూ.30 నుంచి రూ.50 వరకు పలుకుతోంది. రాష్ట్రంలోని రాయలసీమ జిల్లాల రైతులు దీన్ని ప్రధానంగా పండిస్తారు. ఈ తోటల్లో దిగుబడి తుది దశకు చేరుకోవడంతో సమీప జిల్లాల్లోని మార్కెట్లకు సరఫరా గణనీయంగా తగ్గిపోయింది. దీనికి తోడు చెన్నై మార్కెట్లో విపరీతమైన డిమాండ్ ఉండటంతో కొంత మంది హోల్‌సేల్ వ్యాపారులు అక్కడికి తరలిస్తున్నారు. ధరల పెరుగుదలకు ఇదీ ఓ కారణమవుతోంది.

వామ్మో.. ఇంతా..!

చేతిలో రూ.200తో వెళ్తే కూరగాయలు సగం సంచికి కూడా రావడం లేదు. రూ.500 వెచ్చించినా అంతంతమాత్రంగానే వస్తున్నాయి. కూరగాయల ధరలకు కళ్లు బైర్లు కమ్ముతున్నాయి.
– కుమారి, గృహిణి, శ్రీనివాసనగర్

ప్రభుత్వం నియంత్రించాలి

గత నెలతో పోలిస్తే కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. సామాన్యులు ఇబ్బంది పడకుండా ధరలను ప్రభుత్వం నియంత్రించాలి. లేని పక్షంలో పేద, మధ్య తరగతి వర్గాలకు ఇబ్బంది తప్పదు.
– సానా సుబ్బమ్మ, గృహిణి, సత్యనారాయణపురం

చికెన్ ధరతో వంకాయ పోటీ

వంకాయ ధర చికెన్‌తో పోటీ పడుతోంది. గత నెల్లో కిలో రూ.60 పలకగా, కొద్ది రోజుల క్రితం రూ.120.. ప్రస్తుతం రూ.వందకు చేరింది. మిగిలిన కూరగాయల ధరలూ దాదాపు కొంచెం అటు ఇటు ఉండటంతో వీటిని కొనాలంటేనే సామాన్య, మధ్య తరగతి ప్రజలు భయపడుతున్నారు. కిలో అల్లం రూ.40 నుంచి రూ.290కు.. కిలో క్యారెట్ రూ.100.. పచ్చిమిర్చి కిలో రూ.80.. కాకరకాయ కిలో రూ.50కు పెరిగింది. మరోవైపు తోటకూర, గోంగూర, పాలకూర, మెంతికూర, చుక్కకూరకు డిమాండ్ పెరిగింది. దీంతో వారం క్రితం వరకు రూ.10కి నాలుగు కట్టలివ్వగా, ప్రస్తుతం రెండు కట్టలనే ఇస్తున్నారు.

క్లుప్తంగా

ముగిసిన ఉత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ఆండాళ్ అమ్మవారికి వారం రోజులుగా నిర్వహిస్తున్న తిరువాడిప్పూర ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ప్రాకారోత్సవం, తిరుమంజనం తదితరాలను వేడకగా నిర్వహించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

ధర్మేంద్ర సేవలు ఎనలేనివి



నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో ఎంతో సేవలందించిన హెచ్‌ఈఓ కాట్రగడ్డ ధర్మేంద్ర సేవలు ఎనలేనివని ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు కొనియాడారు. నగరంలోని హంస కార్యాలయంలో సంఘ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. విశాఖపట్నం వెళ్తున్న ధర్మేంద్రను ఘనంగా సత్కరించారు. నేతలు మజరుల్లా, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు



నెల్లూరు(క్రైమ్): బహిరంగంగా మద్యాన్ని సేవిస్తే చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రేఖ స్పష్టం చేశారు. ఆ శాఖ అధికారి నాగమల్లేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి బహిరంగ మద్య సేవనంపై తనిఖీలను గురువారం నిర్వహించారు. మద్యం దుకాణాలకు సమీపంలోని కూల్ డ్రింక్స్ షాపులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కూల్ డ్రింక్స్ షాపుల్లో మద్యాన్ని సేవిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్సైజ్ ఎస్సైలు కృష్ణారెడ్డి, పీర్ హుస్సేన్, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన



నెల్లూరు సిటీ: నగరంలోని 33వ డివిజన్లో గల వెంగళరావునగర్‌లో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపనను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గురువారం చేపట్టారు. క్లస్టర్ ఇన్‌చార్జీలు మన్నెం పెంచలనాయుడు, జలదంకి సుధాకర్, టీడీపీ నేత హజరత్‌నాయుడు, బీజేపీ నేత మండ్ల ఈశ్వరయ్య, వెంకటరమణయ్య, రమణయ్యనాయుడు పాల్గొన్నారు.

ఇంటి నుంచి పరారైన బాలుడు

- తల్లి చెంతకు చేర్చిన పోలీసులు

నెల్లూరు(క్రైమ్): ఇంటి నుంచి పరారైన ఓ బాలుడు రోడ్డుపై తిరుగుతుండగా పోలీసులు చేరదీశారు. వివరాలను సేకరించి తల్లికి అప్పగించారు. పోలీసుల సమాచారం మేరకు.. గుంటూరులో రమ కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె కుమారుడు సుమంత్ స్థానికంగా ఉన్న ఓ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఆ బాలుడు సెల్‌ఫోన్‌కు బానిసయ్యాడు. ఇంటి నుంచి బుధవారం పారిపోయి తిరుపతికి బయల్దేరాడు. నగరంలోని వీఆర్సీ సెంటర్ వద్ద బుధవారం అర్ధరాత్రి ఉండగా, బీట్ కానిస్టేబుళ్లు గమనించి చేరదీసి వివరాలు సేకరించారు. అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చిన్నబజార్ పోలీస్‌స్టేషన్‌కు బాలుడి తల్లి గురువారం చేరుకున్నారు. బాలుడ్ని పోలీసులు అప్పగించారు. పోలీసులకు ఆమె కృతజ్ఞతలను తెలియజేశారు.

న్యాయశాఖ ఉద్యోగిపై దాడికి ఖండన

నెల్లూరు (లీగల్): కోర్టు సమన్లు అందజేసేందుకు వెళ్లిన పెద్దాపురం కోర్టు అమీనా సత్యేంద్రయాదవ్‌పై దాడికి పాల్పడిన ఘటనను నెల్లూరు జిల్లా న్యాయశాఖ ఉద్యోగ సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్, నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనను విడుదల చేశారు.

అక్రమ పదోన్నతులపై విచారణ జరపాలి

నెల్లూరు(అర్బన్): గృహ నిర్మాణ శాఖలో కొంత మంది పొందిన అక్రమ పదోన్నతులపై విచారణ జరపాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయకృష్ణమాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు వేదాయపాలెంలో హౌసింగ్ కార్పొరేషన్ పీడీకి ఆ సంఘ నేతలు వినతిపత్రాన్ని గురువారం సమర్పించారు.

ఏపీటీఎఫ్ మహాసభలు రేపు

నెల్లూరు (టౌన్): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్)ను స్థాపించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నగరంలోని టౌన్‌హాల్లో విద్యా, వైజ్ఞానిక మహాసభలను శనివారం నిర్వహించనున్నామని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, పిచ్చిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యావంతులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పేదలకు అన్నదానం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని రామలింగాపురం సమీపంలో గల అన్న క్యాంటీన్ వద్ద పేదలకు అన్నదానాన్ని గురువారం నిర్వహించారు. టీవీ నటుడు శింగంశెట్టి మురళీమోహన్ జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. తేలపల్లి రాఘవయ్య, రవి, నారాయణ, జయప్రకాష్, కళాంజలి శ్రీనివాసచక్రవర్తి, హరినాథ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత పేర్కొన్నారు. జీపీడీపీ, రక్షిత మంచినీరు, వీధి దీపాల నిర్వహణపై రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లకు గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. శిక్షణ కార్యక్రమం శనివారం వరకు కొనసాగనుందని చెప్పారు. నెల్లూరు డీఎల్డీఓ వసుమతి, ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ'లో న్యాయ విజ్ఞాన సదస్సు


మాట్లాడుతున్న వాణి

నెల్లూరు (టౌన్): నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి వాణి మాట్లాడారు. విద్యార్థులు ర్యాగింగ్ బారినపడితే అవసరమైన సాయం కోసం ఎవర్ని సంప్రదించాలనే అంశమై కళాశాల యాజమాన్యాలు అవగాహన కల్పించాలని సూచించారు. ర్యాగింగ్ ద్వారా అవమానించి బాధిస్తే ఆర్నెల్ల జైలు, రూ.వెయ్యి జరిమానా.. నిర్బంధానికి గురిచేసి గాయపరిస్తే ఏడేళ్ల జైలు, రూ.ఐదు వేల జరిమానాను విధించనున్నారని చెప్పారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, హెచ్‌ఓడీ సునీత, డాక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ అథ్లెట్లకు సత్కారం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): స్వీడన్‌లో నిర్వహించనున్న ప్రపంచ స్థాయి పోటీల్లో దేశం తరఫున ప్రాతినిధ్యం వహించనున్న నెల్లూరుకు చెందిన అథ్లెట్లను నగరంలోని నిర్మల సౌధలో గురువారం సత్కరించారు. క్రీడాకారులు కోటేశ్వరమ్మ (75+), లక్ష్మి (70+), జమున (65+), భాగ్యలత (60+)ను సన్మానించారు. ఈ సందర్భంగా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ నిర్మల నరసింహారెడ్డి మాట్లాడారు. పోటీల్లో పతకాలను సాధించాలని కాంక్షించారు.

విద్యా కమిటీ ఎన్నికలనూ వదల్లేదు

- టీడీపీ నేతల దాష్టీకం
- ఏకగ్రీవానికి హెచ్‌ఎంలపై ఒత్తిడి
- గొల్లకందుకూరులో వివాదాస్పదమైన తీరు
- ఎన్నికలు జరగకుండా రోజంతా కాలయాపన
- చివరికి వాయిదా

నెల్లూరు సిటీ: పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు మంచి సౌకర్యాలు కల్పించేందుకు నిర్వహించే విద్యా కమిటీ ఎన్నికల్లో అధికార పార్టీ నేతల జోక్యం ఎక్కువైంది. నెల్లూరు రూరల్ మండలంలోని పలు పాఠశాలల్లో టీడీపీ నేతలు తమ వర్గానికి చెందిన వారిని ఎన్నుకునేందుకు కుయుక్తులు పన్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులను ఒత్తిళ్లు.. భయభ్రాంతులకు గురిచేయడం ద్వారా ఎన్నికలను ఏకగ్రీవంగా జరిపారు. నెల్లూరు రూరల్ మండలంలో హైస్కూళ్లు 24.. అప్పర్ ప్రైమరీ స్కూళ్లు పది.. ప్రైమరీ స్కూళ్లు 107, ఎయిడెడ్ ఒకటి ఉంది. ఈ క్రమంలో 142కి గానూ 141 పాఠశాలల్లో ఏకగ్రీవం కాగా, ఒకటి మాత్రం వాయిదాపడింది.

17 మంది సభ్యుల మద్దతున్నా..

గొల్లకందుకూరులోని అరుంధతీయవాడ ప్రైమరీ పాఠశాలలో ఎన్నికల సమయంలో 17 మంది సభ్యులు ఒక వైపు ఉన్నారు. అయితే ఆరుగురు సభ్యులు కలిగిన టీడీపీ వర్గం కోసం ఎన్నికలను హెచ్‌ఎం వాయిదా వేశారు. ఉదయం 11 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభంకాగా, సాయంత్రం ఐదు వరకు కాలయాపన చేశారు. కూలీ పనులు చేసుకునే విద్యార్థుల తల్లిదండ్రులు పనులు మానుకొని ప్రక్రియకు హాజరయ్యారు. అయినా స్థానిక హెచ్‌ఎం టీడీపీ వర్గానికి అనుకూలంగా వ్యవహరించారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో తేదీని ప్రకటిస్తామని, అప్పటి వరకు ఎన్నికలను వాయిదా వేస్తున్నామని చివరికి ప్రకటించారు.

టీడీపీ నేతల దౌర్జన్యం

ఎన్నికలు ఏకగ్రీవం కాకుండా అడ్డుకున్నారని ఓ వర్గంపై టీడీపీ నేతలు దౌర్జన్యానికి దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53, 54వ డివిజన్లలో పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను నిర్వహించారు. వెంకటేశ్వరపురంలోని నగరపాలక ఉన్నత.. జనార్దన్‌రెడ్డికాలనీలోని ఉర్దూ పాఠశాల.. భగత్‌సింగ్ కాలనీలోని నగరపాలక పాఠశాలలో ఎన్నికలను జరిపారు.

వేడుకగా బోనాల ఉత్సవం



నెల్లూరు(బృందావనం): ఏసీనగర్‌లోని కోదండరామపురంలో కొలువైన మహాలక్ష్మి అమ్మవారి దేవస్థాన 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బోనాల ఉత్సవాన్ని వేడుకగా గురువారం నిర్వహించారు. గోపూజ, గణపతి పూజ, కలశస్థాపన తదితరాలను ఆలయ ప్రధానార్చకుడు మాచవోలు వేణుగోపాలశర్మ, మాచవోలు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో జరిపారు. ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథ దేవస్థానం నుంచి మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం వరకు పెద్ద సంఖ్యలో మహిళలు బోనాలతో తరలివచ్చారు. ఉభయకర్తలుగా కాటేపల్లి వెంకటరమణయ్య, సరిత దంపతులు వ్యవహరించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ పత్తి నరసింహులు, సభ్యులు వాసిపల్లి నారాయణరెడ్డి, దామెర చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, ఎర్రా వెంకటసుబ్బయ్యనాయుడు, పత్తి శ్రీనివాసులు, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్ర ప్రారంభం నేడు

నెల్లూరు(అర్బన్): పేద రోగులు పడే ఇబ్బందులను గమనించిన లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్, శుభమస్తు షాపింగ్ మాల్ యాజమాన్యం సంయుక్తంగా నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనికి గానూ రూ.80 లక్షలను వెచ్చించి అధునాతన యంత్రాన్ని ఏర్పాటు చేశారు. డయాలసిస్ నిర్వహణకు మరో రూ.పది లక్షలను ఖర్చు చేసేందుకు ముందుకొచ్చారు.

ఈ కేంద్రాన్ని వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ శుక్రవారం ఉదయం ప్రారంభించనున్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(క్రైమ్): నగరంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు.

నూతన చట్టాలను రద్దు చేయాలంటూ నిరసన

నెల్లూరు (లీగల్): నూతన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలంటూ ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసనను గురువారం చేపట్టారు. నగరంలోని జిల్లా కోర్టు సముదాయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంకయ్య, రమేష్, విజయమోహన్‌రెడ్డి, సాయి, కొండలరావు, రాఘవ, సుమంత్ అనిల్, కిరణ్, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

కంటెంట్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ


మాట్లాడుతున్న గిరి

నెల్లూరు(టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో గల నోడల్ రిసోర్సెస్ సెంటర్‌లో కంటెంట్ డెవలప్‌మెంట్ స్టూడియోను కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్ వర్చువల్‌గా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 నోడల్ రిసోర్సెస్ సెంటర్లలో లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కంటెంట్ డెవలప్‌మెంట్ స్టూడియోలను ప్రారంభించనున్నామని వివరించారు. వీడియో మేకింగ్, ఎడిటింగ్, వీడియో పాడ్‌కాస్ట్, పీపీటీ క్రియేషన్స్ తదితర అంశాలపై అధ్యాపకులకు వారం పాటు శిక్షణ ఇవ్వనున్నామని వెల్లడించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ గిరి మాట్లాడారు. 155 మంది అధ్యాపకులకు శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు.

- నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో 'సోషల్ ఎమోషనల్ లెర్నింగ్ అండ్ సెల్ఫ్ డైరెక్ట్ ఎమోషనల్ లెర్నింగ్ ఫర్ ఎంపథీ అండ్ కైండ్‌నెస్ అనే అంశంపై ఐదు రోజుల పాటు వర్క్‌షాపును నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ గిరి తెలిపారు. ఈ మేరకు అధ్యాపకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భావోద్వేగాలపై విద్యార్థులు నియంత్రణ సాధించేందుకు భాషా అధ్యాపకులు కృషి చేయాలని కోరారు.

అక్రమ కేసులను తొలగించాలని వినతి


ఎస్పీతో జేఏసీ నేతలు

నెల్లూరు(క్రైమ్): గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులు, రౌడీషీట్లను తొలగించాలని గిరిజన సంఘాల రాష్ట్ర జేఏసీ నేతలు కోరారు. ఈ మేరకు నగరంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్‌ను జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి, జేఏసీ రాష్ట్ర కార్యదర్శి జీవన్ ప్రసాద్, మహిళాధ్యక్షురాలు మాధవి గురువారం కలిశారు. అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలని కోరారు.

నిద్దరోతున్న నిఘా

- వరుస చోరీలతో హడల్
- నెలన్నర వ్యవధిలో రూ.2.1 కోట్ల సొత్తు చోరీ


నామమాత్రపు విధులు

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో దొంగలు రెచ్చిపోతున్నారు. రోజూ ఏదో ఒక ప్రాంతంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. తాళమేసిన ఇళ్లు.. దుకాణాలు.. ఆలయాలను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతూ ఉన్నదంతా ఊడ్చేస్తున్నారు. నెలన్నర వ్యవధిలో సుమారు రూ 2.1 కోట్లకుపైగా విలువైన సొత్తు దొంగలపాలైంది. నగరంలో పరిస్థితి అధ్వానంగా మారుతోంది. చోరీలకు సంబంధించిన ఎఫ్‌ఐఆర్‌లు ఏదో ఒక పోలీస్‌స్టేషన్లో నమోదవుతూనే ఉన్నాయి. చిన్నచితకా దొంగతనాలపై ఫిర్యాదులు అందుతున్నా, పోలీసులు కేసులు నమోదు చేయడంలేదని బాధితులు వాపోతున్నారు. చోరీలను అరికట్టడంలో పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిఘా, సాంకేతికత దొంగతనాలను కట్టడి చేయలేకపోతున్నాయి. ఈ పరిణామాలతో ఇల్లు విడిచి బయటకెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. తాజాగా నగరంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో దొంగతనాలు గురువారం తెల్లవారుజామున జరిగాయి.

పగలు, రాత్రి గస్తీ నామమాత్రంగా మారింది. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రైమ్ పార్టీ పోలీసులున్నారు. నేరాల కట్టడి.. నేరస్తుల కదలికలపై నిఘా.. కేసులను ఛేదించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే అధిక శాతం క్రైమ్ పార్టీలు నేరం జరిగాక హడావుడి చేయడం మినహా, ఇవి జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జైల్ మానిటరింగ్ వ్యవస్థా అంతంతమాత్రంగానే ఉంది. దీంతో నేరస్తులు నేరాలను యథేచ్ఛగా పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. కొన్ని ప్రాంతాల్లోని క్రైమ్ పార్టీలు అసలు విధులను పక్కనబెట్టి అధికారులకు ఆదాయవనరులు చేకూర్చే పనులకే పరిమితమయ్యారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి.

రూ.పది లక్షల అపహరణ



వెంకటేశ్వరపురంలోని ఇస్లాంపేటలో గల లక్ష్మీవీధిలో విజయ డెయిరీ విశ్రాంత ఉద్యోగి సుబ్బారావు నివాసం ఉంటున్నారు. బెంగళూరులో ఉంటున్న కుమార్తె వద్దకు తన భార్యతో కలిసి ఈ నెల ఒకటిన వెళ్లారు. ఈ క్రమంలో ఇంటి తాళాలను గుర్తుతెలియని దుండగులు పగలగొట్టి రూ.పది లక్షల విలువజేసే బంగారు, వెండి ఆభరణాలు, నగదును దోచుకెళ్లారు. ఇంటికి గురువారం తెల్లవారుజామున వచ్చిన బాధితులు చోరీ ఘటనను నిర్ధారించుకొని నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. వేలిముద్రలను క్లూస్ టీమ్ సేకరించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీసీఎస్‌నగర్‌లో చోరీ


పరిశీలిస్తున్న ఎస్సై రమేష్‌బాబు

దర్గామిట్టలోని ఎల్‌ఐసీ ఎదురుగా సీసీఎస్‌నగర్‌లో ఓ ప్రముఖ ఆటోమొబైల్స్ షారూమ్ యజమాని నరేంద్రనాథ్ నివాసం ఉంటున్నారు. కుటుంబసభ్యులతో కలిసి ఇంట్లోని పడకగదిలో బుధవారం రాత్రి నిద్రించారు. ఈ క్రమంలో మెయిన్ డోర్‌ను గుర్తుతెలియని దుండగులు గురువారం తెల్లవారుజామున పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. కప్‌బోర్డులోని రూ 2.3 లక్షలను అపహరించుకెళ్లారు. వాచ్‌మెన్ బయటకు రాకుండా తలుపులకు తాళాలేశారు. ఉదయం నిద్ర లేచిన కుటుంబసభ్యులు చోరీ విషయాన్ని నిర్ధారించుకొని దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి ఇన్‌చార్జి ఎస్సై రమేష్‌బాబు చేరుకొని చోరీ తీరును పరిశీలించారు. ఘటన స్థలంలో వేలిముద్రలను క్లూస్ టీమ్ సేకరించింది. ఈ దుండగులే సమీపంలోని మరో ఇంట్లో చోరీకి యత్నించగా, అక్కడివారు పెద్దగా కేకలేయడంతో పరారయ్యారు.


సీసీ కెమెరాల్లో నిందితుడి ఆనవాళ్లు